సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

సరూర్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 16వ డివిజన్‌లోని పాష్ కాలనీకి చెందిన మన్యంకొండతో పాటు దాసరి రాజు కూతురు వేదశ్రీ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి, పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. దాంతో వైద్యానికయిన ఖర్చు కోసం అప్పు చేయాల్సి వచ్చిందని పేర్కొంటూ బాధితులు మాజీ కార్పొరేటర్ అనిల్‌కుమార్‌యాదవ్ సహకారంతో ఎమ్మెల్యే సబితారెడ్డిని కలువగా, ఆమె సీఎం సహాయనిధి నుంచి మన్యంకొండకు రూ.40,500, వేదశ్రీకి రూ.19వేలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కులను శుక్రవారం అనిల్‌కుమార్ మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


పాఠశాల ఉపాధ్యాయులకు కంప్యూటర్ అందజేస్తున్న సందీప్‌చారి

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ వితరణ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన సందీప్‌చారి కంప్యూటర్‌ను స్కూల్ హెచ్‌ఎం సంతోషకు శుక్రవారం వితరణగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలకు తనవంతు సహాయంగా కంప్యూటర్ అందించినట్లు సందీప్‌చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ్య, పుష్పా, పార్వతి, కవిత, అన్నపూర్ణ, శ్రీవాణి, గ్రామస్థులు సాయి ప్రణీత్, గోపి పాల్గొన్నారు.


అనాథ విద్యార్థులకు విరాళం అందజేస్తున్న స్లేట్ ది స్కూల్ బృందం

అనాథ విద్యార్థి గృహానికి 'స్లేట్ ది స్కూల్' విరాళం

ఎల్బీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ చిత్రాలేఅవుట్‌కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి కర్మన్‌ఘాట్‌లోని స్లేట్ ది స్కూల్ విద్యార్థులు విరాళం అందజేశారు. స్కూల్‌కు చెందిన విద్యార్థులు తమ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం అనాథ విద్యార్థి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్లేట్ ది స్కూల్ ప్రిన్సిపాల్ కేనా మాట్లాడుతూ, తమ పాఠశాలకు చెందిన 1 నుంచి 4వ తరగతికి చెందిన 300 మంది విద్యార్థులు.. అనాథ విద్యార్థి గృహంలోని 110 మంది విద్యార్థులకు సరిపడా పుస్తకాలు, స్టేషనరీ, పండ్లు, స్నాక్స్, బిస్కెట్లు, దుస్తులు విరాళంగా అందజేశారన్నారు. అనంతరం అనాథ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మానవతా విలువలను పెంపొందిస్తూ.. వారి అభ్యున్నతికి పాటుపడుతుండడంపై అభినందిస్తూ రాసిన లేఖను అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు అందజేశారు.


ప్లాసిక్‌పై అవగాహన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్

ప్లాస్టిక్ వాడకం ప్రాణాంతకం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే నష్టాలపై రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో కోరియర్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగం మంచిది కాదని వాటి వాడకం వల్ల ప్రాణాంతక వ్యాధులు రావడంతో పాటు భవిష్యత్ తరాలు కూడా నష్టపోతాయని వారు వివరించారు. అన్ని స్థాయిల్లో ప్లాస్టిక్‌ను నిషేధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ బాసెట్టి, శ్రీకాంత్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుధారాణి, వెంకట్‌రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


కార్యవర్గ సమావేశంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య సభ్యులు

తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య సమావేశం

మన్సూరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నాగోల్ బండ్లగూడలోని రాజీవ్ సద్భావన టౌన్‌షిప్‌లో నిర్వహించారు. టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా కార్యవర్గాల నియామక ప్రక్రియ వేగంగా చేపట్టాలని, బ్రాహ్మణులకు వివిధ సేవా కార్యక్రమాల ప్రణాళికలు అమలు చేయడం, బ్రాహ్మణుల అభివృద్ధే ఎజెండాగా సంఘాన్ని విస్తరించి బలోపేతం చేయడం, యువ బ్రాహ్మణుల్లో సాంస్కృతిక వారసత్వం, సేవల పట్ల అవగాహన పెంపొందించడం, భవిష్యత్తులో సేవలు, సామాజిక సేవా ప్రాజెక్టుల రూపకల్పన వంటి అంశాలను చర్చించారు. దీంతోపాటు ఈ నెలలో టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో భువనగిరిలో అన్ని బ్రాహ్మణ సంఘాల సమన్వయంతో కార్తీక వన సమారాధాన నిర్వహణ వంటి అంశాలను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కానాల శ్యాంసుందర్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నూరి లక్ష్మీనరసింహారావు, కోశాధికారి ఉరే ప్రసాద్‌రావు, సహ కోశాధికారి గూడ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చెన్నూరి రాధాకృష్ణన్‌రావు, మీడియా ఇన్‌చార్జి మంత్రిప్రగడ శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి గూడ జయరాం తదితరులు పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు


చెట్లకొమ్మలు తొలగిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హైవేకాలనీలో అడ్డదిడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను శుక్రవారం చేపట్టారు. రోడ్లకు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లకు చెట్లకొమ్మలు అల్లుకుని అడ్డదిడ్డంగా ఉండటంతో హైవేకాలనీ సభ్యులు కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు తెలియజేయడంతో శుక్రవారం వాహనంతో చెట్ల కొమ్మల తొలగింపు చర్యలు చేపట్టారు.


బురద, మురుగు నీటితో పిస్తాహౌజ్ పక్కన కాలనీ ప్రధాన రహదారి దుస్థితి


పిస్తాహౌజ్ వద్ద మురుగు నిలవడంతో మడుగును తలపిస్తున్న కాలనీ రోడ్డు


రోడ్డుపై తవ్వి వదిలేసిన గుంత

దారులు ఇలా.. వెళ్లేదెలా!

4వ వార్డులో బురదమయంగా దారులు.. పట్టించుకోని మున్సిపల్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పలు కాలనీల దారులు బురద, చిత్తడి మయంగా మారాయి. ఆ బురద రోడ్డులో నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో మడుగులను తలపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు జాతీయ రహదారి పక్కన సర్వే నంబర్ 351లో రోడ్డుల దుస్థితి మరీ దారుణంగా తయారయింది. కాలనీలోని అన్ని వైపులా దారులు మడుగులను తలపిస్తున్నాయి. పిస్తాహౌజ్ వెనుక వైపు ఉన్న రోడ్డులో డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోవడంతో మ్యాన్‌హోల్‌లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతుండడంతో భరించలేని దుర్వాసన వస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడవలేని స్థితిలో రహదారులు ఉండడంతో తమ ఇళ్ల, కార్యాలయాలకు వెళ్లలేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రధాన రోడ్డు వద్దనే ఆపి నడుచుకుంటూ వెళ్లాల్సివస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ అధికారులను కలిసి సమస్య వివరించామని కాలనీ వాసులు తెలిపారు. అయిన సంబంధిత అధికారులు కనీస మరమ్మతులు కూడా చేయించడం లేదని వారు అసహనం వ్యక్తం చేశారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

ఏజీఆర్ కాలనీలో మురుగు సమస్యపై స్థానికుల ఆందోళన ● కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే వెటకారంగా మాట్లాడారని ఆవేదన

సరూర్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలోని మురుగు సమస్యను బడంగ్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిపోయి వెటకారంగా మాట్లాడుతున్నారని 30వ డివిజన్‌లోని ఏజీఆర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో దాదాపు ఆరు నెలలుగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు మొత్తం రోడ్డు మీద పారుతున్నదని, దీనిపై తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. సదరు సమస్యపై కాలనీవాసులు శుక్రవారం బీజేపీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులతో పాటు బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మురుగు రోడ్డుపై పారుతూ స్థానికంగా మడుగులు ఏర్పడ్డాయని, దాంతో దుర్గంధం, దోమలు వ్యాపించి అనేక మంది అస్వస్థతకు గురయ్యారని ఆందోళన వక్తం చేశారు. ఇదే విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే.. 'మీరు ఆస్పత్రిలో చేరితే నేనేం చేయాలి?' అంటూ వెటకారంగా మాట్లాడారని వారు వాపోయారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు ప్రజలతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కాగా విషయం తెలుసుకున్న మునిసిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి ఏజీఆర్ కాలనీకి చేరుకుని సమస్యను పరిశీలించారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో బాధితులు తమ ఆందోళన విరమించారు. సమస్య పరిష్కరించకపోతే మురుగు తీసుకువచ్చి మునిసిపల్ కార్యాలయం ఎదుట పోసి ధర్నా చేస్తామని కాలనీవాసులు, బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సైదులు, జగదీశ్వర్‌రాజు, తీగల సురేందర్‌రెడ్డి, బంగారు రాహుల్, సురేశ్, ప్రవీణ్‌గౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతం : కార్పొరేటర్ కళ్లెం

హయత్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లో వేగవంతంగా సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులను ఆయన కాలనీ సంక్షేమ సంఘంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురానగర్ కాలనీలో దాదాపు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమల్ నాయక్, నాయకులు సురేష్, కృష్ణమూర్తి, యాదగిరి, మహేష్, సార్య, శంకర్, నిర్మల, రాజు, కిరణ్, రవీందర్‌తో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.


మధురానగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

భవన నిర్మాణ పనులు ప్రారంభం

హన్మగల్ హయత్‌నగర్‌లో రూ. 50 లక్షలతో నిర్మించనున్న అభ్యుదయ యువజన సంఘం భవన నిర్మాణ పనులను కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానికంగా అభ్యుదయ యువజన సంఘం భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. బోరు వేయడం పూర్తి కాగానే పనులు వేగంగా చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగని శ్రీను, నాయకులు నగేష్, ఈశ్వర్, యాదయ్య, శంకరయ్య, నరసింహ, లక్ష్మయ్య, బోడ నరసింహతో పాటు పలువురు పాల్గొన్నారు.


అండర్-15 విభాగంలో గోల్డ్ కప్ గెలిచిన సావేజ్ స్ట్రైకర్స్ గర్ల్ టీమ్

సావేజ్ స్ట్రైకర్స్ గర్ల్ టీమ్.. గోల్డ్ కప్ కైవసం

మౌలాలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేఎల్కే క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో అండర్-15 గర్ల్ వన్‌డే చాంపియన్‌షిప్-2025 పోటీలలో సావేజ్ స్ట్రైకర్స్ గర్ల్ టీమ్ గోల్డ్ కప్‌ను గెలిచుకున్నారు. కప్ గెలిచిన టీమ్ సభ్యులు మాట్లాడుతూ కీసర పరిధిలోని గోదుమకుంటలోని ఎంఎస్‌డీ అరేనా గ్రౌండ్‌లో నిర్వహించిన అండర్-15 గర్ల్ వన్‌డే చాంపియన్‌షిప్ 2025 పోటీలలో ఏడు జట్లు పోటీ పడగా కెప్టెన్ అనన్య దండు, వైస్ కెప్టెన్ అన్విత సీహెచ్ నాయకత్వంలోని సావేజ్ స్ట్రైకర్స్ గర్ల్ జట్టు 7 వికెట్ల తేడాతో స్పార్క్ క్రికెట్ అకాడమి జట్టుపై గెలిచి గోల్డ్ కప్‌ను గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో ఉత్సాహాన్ని నింపడంతోపాటు రానున్న మ్యాచ్‌లను గెలవాలనే పట్టుదల పెంచుతుందన్నారు.

చిన్నారి అవినా జాయ్‌కి సన్మానం


చిన్నారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి అపర్ణ

కాప్రా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలతో దుస్తులు రూపొందించి ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న చిన్నారి అవినా జాయ్‌ని శుక్రవారం సాకేత్ కాలనీలోని ఫోస్టర్ బిల్లాబాంగ్ హై ఇంటర్‌నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి అపర్ణ ఘనంగా సన్మానించారు. ఇదే స్కూల్‌లో యూకేజీ చదువుతున్న అవినాజాయ్ ఇంట్లోని ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బ్యాగులు, పేపర్ బ్యాగులతో దుస్తులు తయారు చేసి అందరి ప్రశంసలనందుకుంది. చిన్న వయసులో అంతటి ప్రతిభ చూపిన అవినా జాయ్‌ని, ప్రోత్సహించిన తల్లిదండ్రులు తేజస్విని, ప్రవీణ్ కుమార్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఓయూలో అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమోషన్లలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు కొంత కాలంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ఆధ్వర్యంలో కామర్స్ అండ్ బిజినెస్ మెనేజ్మెంట్ కాలేజీ వద్ద భోజన విరామంలో ఆందోళన చేపట్టారు. ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన సీఏఎస్ ఇంటర్వ్యూల్లో ఎన్నడూ లేని విధంగా 48 మంది అధ్యాపకులను రిజెక్టు చేయడాన్ని ఔటా ఖండించింది. బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలు, ఉత్తమ పరిశోధనలు చేస్తున్న అధ్యాపకులకు సైతం ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

పిల్లలకు అర్థమయ్యేలా ట్రాఫిక్ రూల్స్

అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్, ఏఎస్ఐ, సేఫ్టీ ట్రైనర్లు

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పిల్లలందరూ ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. శుక్రవారం హస్తినాపురం ప్రైవేటు స్కూల్ నుంచి 38 మంది చిన్నారులు ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. తొలుత ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రైనర్ ప్రవీణ్ పార్కులో ఉన్న ట్రాఫిక్ నిబంధనల రంగురంగుల పోస్టర్లు, రోడ్డు భద్రత సూచికలను చూపుతూ వివరించారు. పిల్లలు బ్యాటరీ కారులో కూర్చుని పార్కు ఆవరణలో సందడి చేశారు. పిల్లలకు నిబంధనలు అర్థమయ్యేలా కార్టూన్లు తెలుగు, ఇంగ్లిష్ వ్యాఖ్యలతో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ రూల్స్ బుక్‌లెట్స్ అందజేశారు. టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ నర్సింహారావుతో కలిసి రాచకొండ పరిధిలోని 15 ప్రాంతాల్లో 696 మంది వాహనదారులకు నిబంధనలపై 21 కార్యక్రమాల్లో అవగాహన కల్పించారు. ఎల్బీనగర్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, నాగోల్ బైరామల్‌గూడ, అల్కాపురి చౌరస్తాలలో వాహనదారులకు నిబంధనలను గుర్తు చేశామన్నారు. వాహనాదారులకు నిబంధనల కరపత్రాలు పంపిణీ చేశారు.


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య

మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడకండి అంటూ టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి, ఎస్‌పీఓ అమర వర్ధన్‌రెడ్డి ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య సూచించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 49 మంది మద్యం ప్రియులకు 49 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం టీటీఐ లెక్చర్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సిబ్బంది రమేష్ సందేశాత్మక గీతాలు.. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.


చిన్నారులకు సూచిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

చంపాపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హాఫీజ్‌బాబానగర్‌లో జరిగిన పాన్‌షాప్ యజమానిపై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ వివరాల ప్రకారం..హాఫీజ్‌బాబానగర్ సీ బ్లాక్‌లో హర్మన్ మసీదు ప్రాంతంలో ఉన్న పాన్‌షాప్ యజమాని సయ్యద్ సుల్తాన్(27)వద్ద అదే ప్రాంతానికి చెందిన ఇంతియాజ్(26) ఈ నెల 20న అర్ధరాత్రి రూ.125 రెడ్‌బుల్ డ్రింక్ తీసుకొని డబ్బుల డిగితే అతన్ని బెదిరించాడు. తిరిగి అతని సోదరుడు సయ్యద్ ఖాజా(25) 21న తెల్లారుజామున పాన్‌షాప్ తెరిచాడు. ఆ సమయంలో ఇంతియాజ్ సయ్యద్ ఖాజాతో గొడవపడ్డాడు. నిందితుడు పదునైన కత్తితో వచ్చి సయ్యద్ ఖాజా భుజం, తొడ, మెడపైన దాడి చేశాడు. గాయపడిన సయ్యద్ ఖాజాను స్థానికులు ఓవైసీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుని సోదరుడు సయ్యద్ సుల్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడు ఇంతియాజ్ గతంలో కూడా అతని సహచరుడు హసన్, మహ్మద్ ఇఫ్తికార్ ఉల్లాఖాన్‌తో కలిసి వీరిపై దాడి పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 22న రాత్రి ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిందితుడు ఇంతియాజ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్రెడిట్ కార్డు నుంచి రూ.1,22,100 మాయం

కొత్తపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఓ వ్యాపా రి కుమారుడి క్రెడిట్ కార్డు నుంచి రెండు విడతల్లో రూ.1,22,100 సైబర్ మోసగాళ్లు దోచుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం.. మన్సూరాబాద్‌లో ఉండే ఎం.సైదాచారి వ్యాపారి. ఆయన తన కుమారుడు వినోద్‌కుమార్ క్రెడిట్ కార్డు వాడుకునే వాడు. తన ప్రమేయం లేకుండానే సదరు క్రెడిట్ కార్డు నుంచి గుర్తు తెలియని ఖాతాల్లోకి మొదట రూ.50 వేలు, తర్వాత రూ.72 వేలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. ఈనెల 18న ఆయన సైబర్ క్రైమ్‌కి ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన శుక్రవారం ఎల్బీనగర్ పీఎస్‌లోనూ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

హయత్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కమ్మగూడ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫీడర్ పరిధిలోని కమ్మగూడ ఈస్ట్ సూరజ్ నగర్ కాలనీ, సంపద హోమ్స్, న్యూ సుభాష్ నగర్ కాలనీ, గణేష్‌నగర్-3, రాజ్‌రంజిత్ కాలనీ, టీచర్స్ కాలనీ, ఏపీఎటీ కాలనీ, డీఎల్ఆర్ఎల్, శ్రీనగర్ కాలనీ, మస్కతి ప్రాంతం, వెంకటేశ్వరకాలనీ, అన్నపూర్ణా కాలనీ, వీరమణి బిస్కెట్ కాలనీలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఇంజాపూర్ సబ్ స్టేషన్ ఏఈ రాములు తెలిపారు.


విదేశీ విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చీకటిపై వెలుగు విజయం.. దీపావళి సందేశం

● ఓయూలో దీపావళి వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అయోధ్య నుంచి అడిస్ అబాబా వరకు, హైదరాబాద్ నుంచి హనోయ్ వరకు దీపావళి పండుగ "చీకటిపై వెలుగు, చెడుపై మంచి విజయం" అనే సందేశాన్ని అందిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన దీపావళి వేడుకల్లో ఆయన విదేశీ విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి కాల పు సహకారం, ఏకతా స్ఫూర్తి ద్వారా అసాధ్యాన్ని సాధ్యంగా మార్చిన ఉదాహరణలను వివరించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అసమానత్వం, ఆకలి, వాతావరణ మార్పులు వంటి సమస్యలపై యువత కలసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. యువత ఆధునిక సాంకేతికతలో విశ్వవ్యాప్తంగా విజయాలు సాధిస్తున్నారని, హైదరాబాద్ డిఫెన్స్, ఏరోస్పేస్, ఐటీ, లైఫ్ సైన్సెస్‌లో గ్లోబల్ హబ్‌గా మారిందని పేర్కొన్నారు. మహానిర్మాణం, సాంకేతికత, సామాజిక విలువలతో భారత్ 2047 నాటికి మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనున్నదని వ్యాఖ్యానించారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య

పాషా, నరహరి వర్ధంతి సభకు తరలిరావాలి: సీపీఎం

చంపాపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న పాషా, నరహరి 36వ వర్ధంతి వేడుకల బహిరంగసభను విజయవంతం చేయాలని ఎల్బీనగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్‌కాలనీలో శుక్రవారం సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటి సమావేశంను వి.కమర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ సీపీఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన పాషా, మంచాల ఎంపీపీగా పనిచేసిన నరహరి పేదల, శ్రామికుల, కార్మికులు, రైతుల, విద్యార్థుల పక్షాన పోరాడారన్నారు. అనంతరం బహిరంగసభ కరపత్రంను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సర్కిల్ కమిటీ సభ్యులు రామస్వామి, మంతాని యాదయ్య, దుర్గారావు, పురుషోత్తంచారి, కమర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ లైబ్రరీలో పుస్తక ప్రదర్శన ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి స్థాపనకు 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీలో శుక్రవారం "అంతర్జాతీయ హిమానీనదుల సంరక్షణ సంవత్సరం-2025" అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌సీయూఈఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.శ్రీనాగేశ్ ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ డా.ఎ.ఎస్.చక్రవర్తి, డా.ఎస్. యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786